సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 6 । మే । 2025



చీనీ టన్ను రూ.24,100
అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,100, కనిష్టం రూ.2,600 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



బతుకులతో 'బంతాట'
యువత, విద్యార్థులు క్రికెట్ బెట్టింగ్ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాలు సైతం చిన్నాభిన్నమవుతున్నాయి. 8లో



గరిష్టం/కనిష్టం
41.2°/21.5°
జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ఏపీ ఈసెట్



వివరాలు వెల్లడిస్తున్న ఏపీ ఈసెట్ చైర్మన్ సుదర్శనరావు

అనంతపురం: డిప్లొమా విద్యార్థులు లేటరల్ ఎంట్రీ కింద బీటెక్ సెకండియర్‌లో ప్రవేశం పొందేందుకు ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ ఈసెట్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య సోమవారం సాయంత్రం జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి భవనంలో మీడియాకు వెల్లడించారు. ఏపీ ఈసెట్‌కు మొత్తం 35,187 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఏపీలో 109, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్, డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఐడెంటిటీ కార్డు తీసుకెళ్లాలని తెలిపారు. ఎల్రక్టానిక్స్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు.

13న పెనుకొండలో జాబ్‌మేళా



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామాత్యులు సవిత తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 2 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్‌లో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్–21)సప్లిమెంటరీ, ఎంబీఏ మూడో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ అంకారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల సమ్మె



సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు

పుట్టపర్తి అర్బన్: తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం డీఎంహెచ్‌ఓ ఆఫీసు ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ఏపీఎన్‌జీఓలు, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలియజేశారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకూ నిరసనను కొనసాగిస్తామని సిబ్బంది పేర్కొన్నారు.

ఆగని దౌర్జన్యకాండ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా భయానక వాతావరణం నెలకొంది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యకాండ సాగిస్తున్నారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎదురు మాట్లాడిన వారిని హత్య చేయడానికి కూడా వెనుకాడటం లేదు. బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.



రామగిరిలో భయం .. భయం

- పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార పార్టీ నేతల అరాచకం
- ఎమ్మెల్యే పరిటాల సునీత కనుసన్నల్లోనే ఖాకీల విధులు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు
- పరామర్శకు వెళ్లినా టార్గెట్ చేస్తున్న వైనం

పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎవరు వెళ్లినా.. భయభ్రాంతులకు గురి చేశారు. ఘటన జరిగిన కొన్ని రోజుల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి విచ్చేశారు. అదే రోజున హెలిప్యాడ్ ఘటనకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేశారు.

పరామర్శించిన వారిపైనే కేసులు..

పైలట్, కోపైలట్‌కు నోటీసులు పంపించారు. మరో పది మందిని రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రిమాండ్‌కు పంపించాలనే ఉద్దేశంతో ధర్మవరంలో జడ్జి ఇంటికి అరెస్టు చేసిన వారిని తీసుకెళ్లగా ఆయన బెయిల్ ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా సోమవారం హెలిప్యాడ్ ఘటన నేపథ్యంలో మరో 71 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారు.

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి అరాచకపాలనకు శ్రీకారం చుట్టింది. ఏదో ఒక రకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తోంది. వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఏ ఒక్కరినీ వదలడం లేదు. రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక రోజు నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు, అరెస్టులు, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి స్థానికంగా ఉండేందుకు అవకాశం లేకుండా చేస్తున్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రోజూ ఏదో రూపంలో ఇబ్బంది పెడుతూనే ఉన్నారు.

పరామర్శకు వచ్చినా తిప్పలే..
టీడీపీ గూండాల చేతిలో హత్యకు గురైన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చినా చట్ట ఉల్లంఘన కింద కేసు నమోదు చేయాలని పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్ పోలీసులపై ఒత్తిళ్లు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు సైతం తమ విధులను మరచి అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్నారు. పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య హత్యను ఖండిస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన వారందరిపై కూటమి నేతలు దృష్టి సారించారు. రోజుకో కేసులో ఇరికిస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయం వద్ద దాడితో ..
ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా మార్చి 26వ తేదీన రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో అనెక్సర్ 1, 2 ఇచ్చేందుకు వెళ్లిన ముగ్గురిపై టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. అంతటితో ఆగకుండా వారు వచ్చిన వాహనాల్లో మారణాయుధాలు ఉంచి అక్రమ కేసులు బనాయించేందుకు పన్నాగం పన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలిని టీడీపీ నేతలు బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకుని వెళ్లారు. తాము చెప్పినట్లు ఎన్నికలు జరగాలని.. ఎవరో వచ్చి గెలుస్తామంటే ఎలా అంగీకరిస్తామని దబాయించారు.

హత్యతో భయం.. భయం..
ఉగాది పండుగ రోజున రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పరిటాల సునీత సమీప బంధువు రాజన్న మనవడు ఆదర్శ్.. అదే గ్రామానికి చెందిన కురుబ లింగమయ్యపై దాడి చేశాడు. లింగమయ్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై టీడీపీ గూండాల దాడిని అడ్డుకునేయత్నం చేశాడనే కక్షతో హత్య చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. గొడవకు.. హత్యకు నాలుగైదు రోజులు గడువు ఉన్నప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అలాగే హత్య చేసే సమయంలో సుమారు 20 మంది వరకూ ఉన్నట్లు తెలిసింది. కానీ కేవలం ఇద్దరిపై మాత్రమే కేసు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోంది.

రంగంలోకి ప్రత్యేక బలగాలు..
పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ ఘటన కేసులో ఇప్పటికే పది మందిని అరెస్టు చేసి బెయిల్‌పై వదిలారు. అయితే మరింత మందిని అదుపులోకి తీసుకోవాలనే ఉద్దేశంతో హైదరాబాద్, బెంగళూరుకు పోలీసు ప్రత్యేక బలగాలు వెళ్లినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని అరెస్టు చేయాలనే ఉద్దేశంతో ముందుగా కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్నట్లు సమాచారం. మాజీ మంత్రి పరిటాల సునీత కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ నడుస్తోందన్న విమర్శలున్నాయి.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని నిర్దేశించిన వ్యవధిలోగా చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో పాటు అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 236 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతుల స్థితిగతులను ఆయా శాఖల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్ధకశాఖ జేడీ శుభదాస్, పట్టుపరిశ్రమల శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్ కుమార్, ఎల్‌డీఎం రమణకుమార్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఉద్యానశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్ బేగం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏదీ రియల్ కాదు

- అనంతపురంలో ఎయిర్‌పోర్ట్ వస్తోందని ప్రచారం
- బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి 6 లేన్లు అవుతుందని కరపత్రాలతో మార్కెటింగ్
- ఇప్పటివరకూ ఆరు లేన్ల ప్రతిపాదనే లేదంటున్న జాతీయ హైవే అథారిటీ
- నమ్మించి నట్టేట ముంచడానికి యత్నిస్తున్న 'రియల్' వ్యాపారులు



ఇప్పటివరకూ సంప్రదింపులే లేవు



అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఎలాంటి సంప్రదింపులూ లేవు. ప్రభుత్వం నుంచి గానీ, ఏవియేషన్ కార్పొరేషన్ నుంచి గానీ మాకు సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి సమాచారం వస్తేనే దీనిపై ముందడుగు పడుతుంది.
– వి.వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లాకు ఎయిర్‌పోర్ట్ వస్తోందని, అతి కొద్ది నెలల్లోనే ఫ్లైట్‌లు దిగుతాయని జరుగుతున్న ప్రచారం సామాన్యులను విస్మయ పరుస్తోంది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న ఈ ప్రచారం మాయలో పడి చాలామంది భూములు అధిక ధరలకు కొని తీవ్రంగా నష్టపోతున్నారు. ఉదయాన్నే కాలేజీలు, ప్లే గ్రౌండ్‌లు, పార్కుల వద్దకు వచ్చే వాకర్స్‌కు కరపత్రాలు పంచుతున్నారు. దానిపై ఎయిర్‌పోర్ట్ డిజైన్‌తో పాటు హైవే దూరం, ప్లాట్ల లేఅవుట్ వంటివన్నీ చూపిస్తోంటే చాలామంది నిజమేనేమో అని నమ్మేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ అని చెబుతూ..
కూడేరు మండల కేంద్రం జిల్లా కేంద్రం అనంతపురానికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంది. తలుపూరు, సజ్జల కాల్వ, బాపనపల్లె గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాలు సేకరిస్తున్నారని, ఇక్కడ ఎయిర్‌పోర్టు ఖరారైందని రియల్ ఎస్టేట్ వాళ్లు చెబుతున్న కహానీ. ఇదంతా ప్రైవేటు భూమే. ఎకరా కనీసం రూ.30 లక్షలు ధర చెల్లించినా భూమికే రూ.450 కోట్లు చెల్లించాలి. కనీసం వంద ఎకరాలు కూడా ప్రభుత్వ భూమి లేకుండా ఎయిర్‌పోర్ట్ సాధ్యమా అన్నది నిపుణుల మాట. రోజుకో ప్రచారంతో ఆ ప్రాంత రైతులు భయాందోళన చెంది, తమ భూములు ఎక్కడ లాక్కుంటారోనని ఏకంగా జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. ఇదంతా నిజం కాదని, మీరు అలాంటివేవీ నమ్మొద్దని చెప్పి పంపించారు.

ఆరులేన్ల రహదారి పేరుతోనూ...
ప్రస్తుతం బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా ఉంది. ఈ రహదారిని ఆరులేన్ల రహదారిగా చేస్తున్నారంటూ కొందరు ప్రచారం మొదలుపెట్టారు. దీంతో చాలామంది చిన్న చిన్న పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ జాతీయ హైవే అథారిటీ అధికారులు మాత్రం అలాంటి ప్రతిపాదనే లేదని చెబుతున్నారు. జాతీయ రహదారి ఆనుకుని కొడికొండ నుంచి గుత్తి వరకు వందల ఎకరాల్లో వెంచర్లు వేసిన బడా పెట్టుబడి దారులు చేస్తున్న దుష్ప్రచారంతో సగటు మదుపరులు నష్టపోతున్నారు. ఎయిర్‌పోర్టు, రహదారి వెడల్పు పనులు అయ్యాక ధరలు పెరిగిపోతాయని, ఇప్పుడు కొనుక్కుంటే చౌకగా లభిస్తాయని నమ్మబలికిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడి దారులంతా టీడీపీ నేతలే ఉండటం గమనార్హం.

వైఎస్సార్ స్మారక స్థూపం పునఃప్రతిష్ట

చిలమత్తూరు: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలకు గుర్తుగా హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పునఃప్రతిష్టించారు. మున్సిపల్ అధికారులు శనివారం రాత్రి స్మారక స్థూపాన్ని తొలగించడం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయి. మున్సిపల్ అధికారులు తిరిగి స్థూపాన్ని ఏర్పాటు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నూతన స్థూపాన్ని పునఃప్రతిష్టించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరి కాయలు కొట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మాట్లాడుతూ స్మారక స్థూపాన్ని కూటమి నాయకుల సూచనలతో అధికారులు తొలగించారన్నారు. వైఎస్సార్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరితరమూ కాదన్నారు. ఎంతటి వారైనా తమ అభిమాన నేత స్మారకంగా ఉన్న వాటి జోలికొస్తే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.ఏ శివ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్ మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, నిస్సార్ అహ్మద్, రాము, టౌన్ కన్వీనర్ మస్సూర్, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగరాజు, రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దాదాపీర్, డా.బాషా, జయప్ప, మల్లికార్జున, చంద్ర, రామచంద్ర, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మింటు, ఫారుఖ్, షబ్బీర్, మాజీ మండల కన్వీనర్ నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, తిప్పేరుద్రయ్య, శ్రీరాములు, శబరీష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సానె రంగారెడ్డి, న్యాతరెడ్డి, నవీన్, ప్రణయ్‌రెడ్డి, నరసింహులు, చాంద్‌బాషా, అయూబ్ బేగ్, కవితారెడ్డి, సహేరాభాను, రామాంజనేయులు, సూర్యమోహన్, సలాం తదితరులు పాల్గొన్నారు.



రహమత్‌పురం సర్కిల్‌లో వైఎస్సార్ స్మారక స్థూపాన్ని పునఃప్రతిష్టిస్తున్న వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కాలువ ఇలా.. నీరు వెళ్లేదెలా?



మట్టి, పిచ్చి మొక్కలతో నిండిన కొడగార్లగుట్ట వద్ద ఉన్న సప్లయ్ చానల్




కొడగార్లగుట్టకు వెళ్లే రోడ్డులో దెబ్బతిన్న బ్రిడ్జి

- నీరు పారక వందల ఎకరాల ఆయకట్టు నిరుపయోగం


రొళ్ల: సప్లయ్ చానల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వందల ఎకరాలు నిరుపయోగంగా మారాయి. రొళ్ల మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామం వద్ద ఉన్న సప్లయ్ చానల్ మట్టి, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో వర్షపు నీరు చానల్ గుండా వెళ్లడం లేదు. నీళ్లన్నీ కర్ణాటక రాష్ట్రం వైపు వృథాగా వెళ్తున్నాయి. రొళ్ల మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అక్కడ కురిసిన వర్షపు నీరు వృథా కాకూడదనే కొడగార్లగుట్ట సమీపంలో 1996లో రూ.5 లక్షల వ్యయంలో రెండు కిలో మీటర్ల మేర సప్లయ్ చానల్‌తో పాటు కొడగార్లగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేశారు. వర్షపు నీరు సప్లయ్ చానల్ గుండా రొళ్ల కొండ వద్ద ఉన్న వంక తర్వాత చెరువుకు చేరేవి. అయితే ఏళ్లుగా మట్టి, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో సప్లయ్ చానల్ అధ్వానంగా తయారైంది. దీంతో రొళ్ల మండలంతో పాటు అగళి మండలంలోని వందలాది ఎకరాల భూములు నిరుపయోగంగా మారాయి. కర్ణాటక వైపు నీళ్లు వెళ్లకుండా సప్లయ్ చానల్ సమీపంలో చెక్‌డ్యాంను కూడా నిర్మించారు. అయితే చెక్‌డ్యాం ఎత్తు పెంచకపోవడంతో వర్షపు నీళ్లు చానల్ గుండా వెళ్లకుండా దిగువ ప్రాంతమైన కర్ణాటక వైపు వెళ్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో రూ.7 లక్షలతో మరమ్మతు పనులు చేసినా చానల్ మళ్లీ మూసుకుపోవడంతో నీళ్లు పారడం లేదు.

మరమ్మతు పనులు చేపట్టాలి



రొళ్ల చెరువు ఆయకట్టు కింద నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. అందులో ప్రస్తుతం వర్షాధారం కింద ఎకరాలో రాగి, ఎకరాలో వేరుశనగ పంటతో పాటు మరో ఎకరాలో ఉలవలు, జొన్నలు సాగు చేశాను. సప్లయ్ చానల్ ద్వారా నీళ్లు మళ్లిస్తే నాలాంటి ఆయకట్టు రైతులందరూ బాగుపడతారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.
– బసవరాజు, రొళ్ల

నీరంతా వృథా అవుతోంది



హొట్టేబెట్ట పంచాయతీ అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు వృథా అవుతున్నాయి. కొడగార్లగుట్ట వద్ద ఉన్న సప్లయ్ చానల్ నిరుపయోగంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సప్లయ్ చానల్ గుండా వర్షపు నీటిని మళ్లించడంతో చెరువు నిండి పంటలు బాగా పండేవి. సప్లయ్ చానల్‌ను బాగు చేసి నీరు పారే విధంగా చర్యలు చేపట్టాలి.
– దేవరాజు, అగళి

ఆర్డీఓపై చర్యలు తీసుకోండి

ప్రశాంతి నిలయం: 'ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల నుంచి ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ధర్మవరం ఆర్డీఓ అక్రమార్కులతో కుమ్మక్కు అయ్యారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిపై తక్షణమే విచారణ జరిపి ఆర్డీఓతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్‌తో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓకు ప్రతి నెలా ఇసుక మాఫియా నుంచి రూ.10 లక్షల మామూళ్లు ముడుతున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. లోకాయుక్త, చీఫ్ సెక్రెటరీ, అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితరులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కౌన్సిలర్ సాకే శివ, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు అమీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఎం.చౌడప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ అభిషేక్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సూర్యప్రభ వాహనంపై లక్ష్మీ చెన్నకేశవుడు

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామి వారి భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై స్వామిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం సర్వభూపాల, సింహ వాహనాల్లో స్వామి వారు దర్శనమివ్వనున్నట్లు ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు తెలిపారు.



క్లుప్తంగా

పలువురికి పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



పొజిషన్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యే బాలకృష్ణ, కలెక్టర్ చేతన్

హిందూపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొల్లకుంటలో 237 మందికి ఇంటి పట్టాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, కలెక్టర్ టీఎస్ చేతన్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూపురం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలు చేస్తున్నామని, వచ్చే నెలల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేయబోతున్నట్లు చెప్పారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బతుకులతో 'బంతాట'

- పల్లెలకూ పాకిన క్రికెట్ బెట్టింగ్
- డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు
- పెడదోవ పడుతున్న యువత, విద్యార్థులు
- పందేలతో రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు



• సత్యసాయి సూపర్ హాస్పిటల్ జంక్షన్‌లో ఓ లాడ్జిలో నలుగురు కలిసి రూము అద్దెకు తీసుకున్నారు. శని, ఆదివారాల్లో మకాం వేస్తున్నారు. బంతి బంతికీ బేరం పెడుతున్నారు. ల్యాప్‌టాప్ ద్వారా మ్యాచ్ వీక్షిస్తూ మొబైల్ ద్వారా పందేలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఫోన్‌పే ద్వారా చెల్లింపులు పూర్తి చేస్తున్నారు. గత శనివారం రెండు మ్యాచ్‌లకు కలిపి 50 సార్లు బెట్టింగ్ కాసినట్లు సమాచారం. ఒక్క రోజులో దాదాపు రూ.50 లక్షలు చేతులు మారినట్లుగా తెలిసింది. మ్యాచ్ ముగిశాక ఓ హోటల్‌లో భోజనం చేస్తూ మాట్లాడుకోవడం ద్వారా ఈ విషయం వెలుగు చూసింది.

• ధర్మవరం పట్టణంలో ఓ ఇంట్లో నుంచి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వాట్సాప్ కాల్స్ ద్వారా బంతి బంతికీ బేరం కాస్తున్నట్లు సమాచారం. శాంతినగర్, సిద్ధయ్యగుట్ట, యాదవ వీధిలో ఎక్కువగా బెట్టింగ్ జరుగుతోందని తెలుసుకున్న పోలీసులు రెండు మూడుసార్లు దాడులు నిర్వహించినా సరైన ఆధారాలు లభించకపోవడంతో వదిలేసినట్లు సమాచారం. వెంటనే నిర్వాహకులు అక్కడి నుంచి మకాం మార్చి యథావిధిగా తమ పనిచేస్తుకుంటున్నారని చెబుతున్నారు.

• హిందూపురం బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో పది రోజులుగా ముగ్గురు వ్యక్తులు ఓ రూములో అద్దెకు ఉంటున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల పాయింట్ల పట్టిక ఆధారంగా రన్ రేటు, ఆలౌట్, ఇన్నింగ్స్ వికెట్లు, సెంచరీలు, బౌండరీలపై బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది. మ్యాచ్ ముగిశాక పక్కనే ఉన్న బార్‌కు వెళ్లి మద్యం తాగి పందెంలో గెలిచిన, పోగొట్టుకున్న విషయాలపై ఫోన్‌లో చర్చించుకోవడం ద్వారా విషయం బయటకు వచ్చింది.

సాక్షి, పుట్టపర్తి: క్రికెట్ బెట్టింగ్ అంటే సాధారణంగా మ్యాచ్ గెలుపు లేదా ఓటమిపై బెట్టింగ్ వేస్తుంటారు. అయితే ప్రస్తుతం క్రికెట్ పందేలు ట్రెండ్‌కు అనుగుణంగా మారిపోయాయి. మొబైల్ ద్వారా నిర్వహణ, డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు, బంతి బంతికీ బేరం ఇలా సరికొత్త పద్ధతిలో జోరుగా సాగుతున్నాయి.

బెట్టింగ్‌తో జీవితాలు నాశనం

యువతతో పాటు చాలా మంది విద్యార్థులు కూడా బెట్టింగ్ మాయలో పడి పెడదోవ పడుతున్నారు. విలాసాలకు అలవాటు పడి నిమిషాల్లో డబ్బులు సంపాదించాలనే ఆశతో వక్రమార్గంలో నడుస్తూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కుటుంబ కలహాలు తదితర కారణాలతో తనువు చాలించే పరిస్థితుల వరకూ దారి తీస్తున్నాయి. బెట్టింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఎంతో మంది ఉన్నారు. క్రికెట్ పందేలు పట్టణాల నుంచి పల్లెలకు కూడా పాకింది. మొదటి పవర్ ప్లేలో ఎన్ని వికెట్లు, ఎంత స్కోరు వస్తుందనే దానిపై బెట్ కాస్తున్నారు. కెప్టెన్ వికెట్ ఎవరు తీస్తారు. ఒక మ్యాచ్‌కు సంబంధించి సుమారు వంద రకాలుపైగా బెట్టింగ్‌లు వేస్తున్నట్లు తెలిసింది. ఒక్కొక్కరూ ఒక్కో చోట ఉండి వాట్సాప్ కాల్స్ ద్వారా బెట్టింగ్ కాస్తూ.. ఫోన్ పే ద్వారా ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం.

ముందుగానే ఆఫర్లు

హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి పట్టణాల్లో హోటళ్లు, లాడ్జిల్లో బెట్టింగ్ నిర్వాహకులు మకాం వేస్తున్నారు. ముఖ్యంగా వారంతపు సెలవుల్లో జరిగే మ్యాచ్‌లపై ఒకటికి మూడు నాలుగు రెట్లు ఆఫర్లు ప్రకటిస్తూ పందేలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. స్పిన్ బౌలింగ్‌కే ఎక్కువ వికెట్లు పడుతాయని.. రన్ రేటు ఆరు కంటే తక్కువ ఉంటుందని ముందుగానే రేట్లు ప్రకటిస్తారు. ఆసక్తి ఉన్న వారు ముందుగానే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

బెండు తీస్తాం



జూదం నేరం. యువత బెట్టింగ్ బారిన పడొద్దు. జిల్లాలో ఎక్కడ క్రికెట్ పందేలు జరుగుతున్నట్లు తెలిసినా సమాచారం ఇవ్వండి. బెట్టింగులకు పాల్పడే వారి బెండు తీస్తాం. క్రికెట్ మ్యాచ్ చూడటం తప్పు కాదు. పందెం కాయడం సరికాదు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

– వి.రత్న, ఎస్పీ

బీసీల పేరుతో బహిరంగ దోపిడీ

- వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు రామచంద్ర

పెనుకొండ రూరల్: బీసీల పేరుతో కూటమి ప్రభుత్వం బహిరంగ దోపిడీకి పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర విమర్శించారు. పెనుకొండలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు 50 రోజుల పాటు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి మహిళకూ రూ. 3 వేల స్టయిఫండ్‌తో పాటు శిక్షణ అనంతరం కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేసేలా కార్యాచరణను రూపొందించారన్నారు. ఇందుకోసం ఒక్కో లబ్ధిదారుకు రూ.23 వేలు వెచ్చిస్తున్నట్లుగా ప్రకటించిందన్నారు. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉన్నా... శిక్షణ కాలంలో చెల్లించే రూ.3 వేల స్టయిఫండ్, ఉచితంగా అందజేసే కుట్టు మిషన్ ధర రూ.4,300 పోను... రూ.23 వేలలో మిగిలిన రూ.15, 700 ఏమవుతున్నదో అంతు చిక్కడం లేదన్నారు. శిక్షణ సమయంలో దారం, టేపు, కత్తెర, స్కేల్ వంటి పరికరాలను లబ్ధిదారులే సమకూర్చుకుంటున్నారన్నారు. కొన్ని శిక్షణ కేంద్రాలలో తాగేందుకు మంచినీరు, బాత్‌రూమ్‌లకు కూడా లేవన్నారు. రోజులో ఉదయం 4గంటలు, మధ్యాహ్నం 4 గంటల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, కేవలం రెండు, మూడు గంటల్లోనే ముగించేస్తున్నారన్నారు. మొత్తం ఈ వ్యవహారంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు అయ్యే ఖర్చు రూ.73 కోట్లు కాగా, మిగిలిన రూ.167 కోట్లను దిగమింగేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వ పెద్దలు అమలు చేస్తున్నట్లుగా అర్థమవుతోందన్నారు. జాతీయ స్థాయిలో అనుభవం కలిగిన సంస్థలను పక్కన పెట్టి, సొంత సంస్థలకు శిక్షణ కాంట్రాక్ట్‌లను కట్టబెట్టి కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. బీసీల పేరుతో కుట్టు శిక్షణ వ్యవహారమంతా చూస్తున్న సంబంధిత శాఖ మంత్రి, ప్రభుత్వ పెద్దలు దోచుకునేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. పథకాల పేరుతో ప్రజాధనాన్ని దోచుకొనేందుకు సిద్ధమైన ప్రభుత్వ పెద్దల తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాల్మీకి సాధికారిత కమిటీ సభ్యులు చెన్నేకొత్తపల్లి బొగ్గు కృష్ణా, ఆనంద్, గుట్టూరు పిట్టా బాబు, బి.ఆనంద్, మజ్జిగ నాగరాజు, పరంధామ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్‌కు చావా ఎంపిక



డాక్టర్ సత్యనారాయణ చావా

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం 14వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ కోసం డాక్టర్ సత్యనారాయణ చావాను ఎంపిక చేశారు. లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓగా ఉన్న డాక్టర్ సత్యనారాయణ చావాకు గౌరవ డాక్టరేట్ అందించాలని చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్ ఎమిరటర్స్ ప్రొఫెసర్, ఐఐటీ కాన్పూర్ ను ఎంపిక చేశారు. మే 17న స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నారు. గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవానికి హాజరు కానున్నారు.

చావా విజయ ప్రస్థానం..

లారస్ ల్యాబ్స్ కంపెనీ ఏర్పాటైన 18 ఏళ్లలో ఇప్పటి వరకు 150 కొత్త మందులు కనిపెట్టారు. 150 పేటెంట్లు దక్కాయి. రెస్పెక్ట్.. రివార్డు..రీటైయిన్ అనే మూడు స్తంభాలపై ల్యాబ్స్ నిర్మాణం జరిగింది. నాలుగో స్తంభం డాక్టర్ చావా సత్యనారాయణ. ర్యాన్‌బ్యాక్సీలో యువ పరిశోధకుడిగా డాక్టర్ సత్యనారాయణ విజయ ప్రస్థానం మొదలైంది. మ్యాట్రిక్స్‌లో చేరిన 8 సంవత్సరాలకే ఆ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఎదిగారు. లారస్ ల్యాబ్ స్థాపన (2005) (హైదరాబాద్)తో భారతీయ ఔషధ ఉత్పత్తుల రంగానికి పితామహులు, దిశాదర్శకులు అయ్యారు. సాక్షి 2021 సంవత్సరంలో 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ఆయన్ని ఘనంగా సత్కరించింది.

ఇంటి పట్టాలు ఇవ్వకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రశాంతి నిలయం: జిల్లాలో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వకుంటే రాబోవు రోజుల్లో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ హెచ్చరించారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్, నాయకులు నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, రామకృష్ణ, శ్రీనివాసులు, హరి, పెద్దన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాప్తాడు'ను ఎడారిగా మార్చకండి

- రైతు సంఘం నాయకుల డిమాండ్
- హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపాలంటూ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు

కనగానపల్లి: జిల్లాకు ప్రధాన సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేపట్టి వెనుకబడిన రాప్తాడు నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చరాదంటూ కూటమి ప్రభుత్వాన్ని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా కనగానపల్లి మండలం బద్దలాపురం వద్ద హంద్రీ-నీవా కాలువలో చేపట్టిన లైనింగ్ పనులను సోమవారం రైతు సంఘం, సీపీఐ నాయకులు పరిశీలించి, అక్కడే రైతులతో కలసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హంద్రీ-నీవా కాలువ ద్వారా అందుతున్న నీటితోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంతమేర భూగర్భ జలాలు పెంపొందాయన్నారు. ప్రస్తుతం ఈ నీటి ద్వారానే రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో కుప్పం ప్రాంతానికి నీరు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో కాలువకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేపట్టడం కుట్రపూరితమని మండిపడ్డారు. ఫలితంగా రాప్తాడు నియోజకవర్గంతో పాటు చుట్టు పక్కల ఉన్న సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగుభూములన్నీ బీళ్లుగా మారి రాప్తాడు నియోజవర్గం ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. సీఎం చంద్రబాబు తన కుప్పం నియోజకవర్గానికి నీటిని తరలించాలంటే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలన్నారు. హంద్రీనీవా కాలువలో లైనింగ్ పనులు వెంటనే ఆపకపోతే ప్రజా సంఘాలు, రైతులతో కలసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, నాయకులు రామాంజినేయులు, మాదన్న, ఆదినారాయణ, సీపీఐ నాయకులు బాలరాజు, మల్లికార్జున, నాగరాజు, ప్రసాద్, వెంకటలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న జిల్లా జట్టు

కదిరి అర్బన్: త్వరలో జరిగే జాతీయ స్థాయి మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన నక్షత్ర, సభాఖానం, షబ్రీన్, సరిత, ఝాన్సీరాణి ఎంపికయ్యారు. ఈ నెల 3, 4వ తేదీల్లో ఒంగోలు జిల్లా మార్కాపురంలో జరిగిన 54వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. జట్టులో ప్రతిభ చూపిన నక్షత్ర, సభాఖానం, షబ్రీన్, సరిత, ఝాన్సీరాణిని జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు ఎంపిక చేసినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

'పోలీసు గ్రీవెన్స్'కు 70 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని కురుబ సామాజిక వర్గానికి చెందిన పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కురుబ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక సాయిఆరామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదో తరగతిలో 500, ఆపై మార్కులు, ఇంటర్‌లో 900, ఆపై మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన వారు ఈ నెల 8వ తేదీలోపు 94918 30798, 89859 97169, 95055 51006, 97056 84227 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

నయనానందకరం.. రంగనాథ వైభవం



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు రెండో రోజు సోమవారం సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సామూహిక సాయి గాయత్రి నామస్మరణ చేశారు. సాయంత్రం రంగనాథుని వైభవం పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. కాగా, ఏటా మే 6న నిర్వహిస్తున్న సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ దినం.. మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

జీఓ 117 రద్దు చేయాలి : ఏపీటీఎఫ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పెనుకొండ రూరల్: జీఓ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలంటూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రయోగాలు వీడాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొడూరు శ్రీనివాసులు, జోనల్ అధ్యక్షుడు మల్లికార్జున, రవిచంద్ర, గోపాల్, వెంకటరమణ, ఆంజనేయులు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి



గంగాధరప్ప (ఫైల్)

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లి సమీపంలో ఉన్న ఓ మామిడి తోటలో నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం పట్టణానికి చెందిన టీడీపీ నేత నంజప్పకు చెందిన మామిడి తోటలో మడకశిర మండలంలోని కల్లుమర్రి గ్రామానికి చెందిన గంగాధరప్ప(35)తో పాటు మరో ఇద్దరు పనిచేస్తున్నారు. రోజూ స్వగ్రామం నుంచి వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లేవారు. ఈ క్రమంలో సోమవారం పనికి వచ్చిన గంగాధరప్ప నీటిని వదిలేందుకు సంప్ వద్దకు వెళ్లాడు. సాయంత్రమైనా ఆయన తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన మిగిలిన ఇద్దరు కూలీలు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అప్పటికే నీటిలో మృతదేహం తేలియాడుతుండడం గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ వెంకటేశులు తెలిపారు. కాగా, గంగాధరప్పకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి బస్సు స్టేజ్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం పూలకుంట, చియ్యేడు గ్రామాలకు చెందిన కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి ద్విచక్ర వాహనంపై బత్తలపల్లి వైపు నుంచి స్వగ్రామాలకు వెళుతుండగా యర్రాయపల్లి మలుపు వద్ద అనంతపురం వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న బెంగళూరుకు చెందిన చిన్నారి దింపానకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

ధర్మవరం రూరల్: మండలంలోని గుట్టకిందపల్లికి చెందిన నరసింహులుపై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల వయసున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తిస్తూ ఫొటోలు తీశాడంటూ బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సోమవారం తెలిపారు.

● ఈత.. భలే మజా



నీళ్లలోకి డైవ్ చేస్తున్న విద్యార్థి

అమరాపురం: మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఈత బాటపడుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది వ్యవసాయ బావుల వైపు మొగ్గు చూపుతుంటే.. మరికొందరు తమకు అందుబాటులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు ప్లాస్టిక్ స్విమ్మింగ్ పూల్‌లను తోటల్లో వేసుకుని ఎంజాయ్ చేస్తున్నారు.



గాలి ట్యూబ్‌తో ఈత నేర్చుకుంటున్న దృశ్యం



గౌడనకుంటలో ప్లాస్టిక్ కొలనులో సేద తీరుతున్న కుటుంబ సభ్యులు